దొంగతనాల కేసును ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ రఘునాథ్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 10: రాత్రి వేళల్లో ఇళ్లలో చోరీలకు పాల్పడుతూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని అచ్చంపేట పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఎస్పీ విలేకరులకు వెల్లడించారు. అచ్చంపేట, కల్వకుర్తి వంటి పట్టణాల్లో రాత్రి వేలల్లో ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దుండగులను శనివారం ఉదయం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆకస్మికంగా తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా పలు దొంగతనాల్లో నిందితులుగా ఒప్పుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో ఏ1గా అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావికి చెందిన వినోద్‌కుమార్ కొబ్బరి వ్యాపారం చేస్తూ ప్రస్తుతం సైబరాబాద్‌లోని సరస్వతినగర్‌లో ఉంటుండగా, కొల్లాపూర్ మండలం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నార్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనాయక్‌తండాకు చెందిన మాండ్ల శివగా గుర్తించినట్లు వెల్లడించారు. వీరిపై అచ్చంపేటలో 5 కేసులు, కల్వకుర్తిలో 4 కేసులు ఉన్నాయన్నారు. వీరి నుంచి 79.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 1310 గ్రాముల వెండి ఆభరణాలు, రూ. లక్షా 40 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు ఇద్దరు చిన్ననాటి స్నేహితులని, హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో 4వ తరగతి వరకు చదువుకొని ఆర్థిక సమస్యల కారణంగా చదువుకు స్వస్తి పలికి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ ఇద్దరు కలిశారని, వీరు తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతుంటారని, 2012 నుంచి 2024 వరకు రంగారెడ్డి జిల్లా పరిధిలో కొన్ని కేసుల్లో అరెస్టు కాబడి స్టేట్ హోమ్, జైలులో ఉండేవారని పేర్కొన్నారు. కాగా చాలా దొంగతనాల్లో నిందితులుగా ఉన్న వీరిని పట్టుకొని పలు కేసులను చేధించిన అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, సీసీఎస్ సీఐ శంకర్, ఎస్సై రాములును ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ ఉన్నారు.

శ్రీశైలం డ్యాం వద్ద పర్యాటకుల సందడి

అచ్చంపేట, ఆగస్టు 10 : ఎగువ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నది. పదిరోజులుగా శ్రీశైలం ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువన నాగార్జునసాగర్‌కు కృష్ణమ్మ పరవళ్లు తొక్కడాన్ని చూసేందుకు సందర్శకుల తాకిడి మరింత పెరిగింది. రెండు రోజులు వరుసగా సెలవుదినాలు కావడంతో శ్రీశైలానికి యాత్రికులు, భక్తులు పోటేత్తారు. గేట్ల ద్వారా కృష్ణమ్మ పరుగులు తీస్తూ సాగార్జునసాగర్‌కు పరుగులు పెడుతున్న దృష్యాన్ని కళ్లారా చూస్తూ సెల్‌ఫోల్‌లో బందిస్తున్నారు. డ్యామ్ వద్ద వాహనాల సందడి భారీగా పెరిగింది. యాత్రికులు కుటుంబ సమేతంగా డ్యామ్ లద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగుతున్నారు. రెండు రోజులు సెలవులు కావడంతో పర్యాటకుల సందడి మరింత పెరిగింది. యాత్రికులు, పర్యాటకులతో శ్రీశైలం ప్రధాన రహదారి సందడిగా మారింది.


డ్యాం వద్ద సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

మంత్రి జూపల్లిని కలిసిన మాజీ సర్పంచ్

మంత్రిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి

వెల్దండ, ఆగస్టు 10 : మంత్రి జూపల్లి కృష్ణారావును వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి శనివారం మార్యద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన భూపతిరెడ్డి ఆయనను శాలువాలతో సన్మానించారు. బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

జూపల్లిలో పీఏసీసీఎస్‌ను ఏర్పాటు చేయాలి

చారకొండ, ఆగస్టు 10 : మండలంలో జూపల్లిలో ప్రాథమిక సహకార సంఘం(పీఏసీసీఎస్) ఏర్పాటు చేయాలని డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్యయాదవ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్యయాదవ్ మాట్లాడుతూ మండలంలోని జూపల్లి, చంద్రాయన్‌పల్లి, గోకారం, శేరిఅప్పారెడ్డిపల్లి, ఎర్రవెల్లి, జేపల్లి గ్రామాలను కలిపి పీఏసీసీఎస్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వెల్దండలో మండలంలో ఉండడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లేకుంటే చారకొండ పీఏసీసీఎస్‌లోనైనా విలీనం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, సుల్తాన్, జంగయ్య, లింగం, దేవేందర్, శ్రీను, రామస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

త్వరలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తాం..

తిమ్మాజిపేట, ఆగస్టు 10 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.1.50లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేశామని, త్వరలోనే రూ.2లక్షల రుణాలు కూడా మాఫీ చేస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురికీ మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తామని, వారికి అందుబాటులో ఉంటూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మిదేవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కల్వకుర్తి, ఆగస్టు 10 : కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన జక్కుల సరిత కుటుంబానికి శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఉప సర్పంచ్ సరిత చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఉప్పల ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేయాలని ట్రస్ట్ సభ్యులకు సూచించారు. వెంకటేశ్ సూచన మేరకు నగదుతోపాటు బియ్యాన్ని బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు గణేశ్ బాధిత కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో రాజేశ్, సాయిలు, రామస్వామి, పరశురాములు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, ఆగస్టు 10 : మండల కేంద్రానికి చెందిన రామస్వామికి ప్రమాదవశాత్తు కాళ్లు విరగడంతో ఇంటి వద్దనే అనారోగ్యంతో ఉన్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి తిరుమల లావణ్య శనివారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శివకుమార్ ఫౌండేషన్ సహకారంతో బాధితుడికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట నాయకులు కన్నా, అనిల్, మహిళలు పాల్గొన్నారు.

మాడాపూర్‌లో విషజ్వరాలు

- ప్రతి ఇంట్లో ఒకలికి నొప్పులు, జ్వరాలు
- చికిత్స కోసం వివిధ దవాఖానలకు వెళ్తున్న రోగులు

లింగాల, ఆగస్టు 10 : లింగాల మండలం సూరాపూర్ పంచాయతీ పరిధిలోని మాడాపూర్‌లో ఏ ఇంట్లో చూసిన విషజ్వరాలు, కీళ్ల నొప్పులు, డెంగీ వంటి తదితర రోగాల బారినా పడి బాధపడుతున్నారు. కొంత కాలంగా ఊరిలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యం చెయించుకోవడానికి రోగులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీతోపాటు జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖాన, అచ్చంపేట ప్రభుత్వ దవాఖానలకు తరలివెళ్తునట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన జహంగీర్‌బీ తన ఇద్దరు పిల్లలతో పాటు అత్తమామలు కూడా జ్వరాలతో బాధపడుతున్నారని దవాఖానల చుట్టూ తిరిగినా రోగాలు తగ్గడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో దోమల బెడద అధికంగా ఉందని, ట్యాంకులో తాగునీరు కలుషితమై రోగాలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన శ్రీరాములు ఆరోపించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వ్యాధులను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై వైద్యాధికారి అనీల్‌కుమార్‌కు వివరణ కోరగా గ్రామంలో దోమలు బెడద అధికంగా ఉందన్నారు. ఇంటి అవరణలో మురుగు నీరు నిల్వ ఉండడంతో మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వస్తున్నాయని వాటి నివారణకు వారంలో మూడు రోజులు డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. గ్రామంలో ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి తిరిగి రోగులకు మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రెండు రోజుల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు

కవిత్వం చైతన్యాన్ని, సామాజిక బాధ్యతను ఇస్తుంది

- కవి విమర్శకుడు సీతారాం

నాగర్‌కర్నూల్, ఆగస్టు 10 : కవిత్వం చైతన్యాన్ని సామాజిక బాధ్యతను ఇస్తుందని, మనిషిలోని సృజనాత్మకతను బయటికి తీస్తుందని ప్రముఖ కవి సీతారాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశం హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక వేదిక, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కవిత్వం నిర్మాణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సభకు నెలపొడుపు సాహితీ వేదిక ప్రధాన కార్యదర్శి వహీద్‌ఖాన్ సభాధ్యక్షత వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ప్రముఖ కవి సీతారాం ప్రారంభించగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవిత్వం సమాజంలో మార్పును తెస్తుందన్నారు. స్వాతంత్ర్య కాలం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు కవిత్వం పాత్ర గొప్పగా ఉందన్నారు. ప్రతి కదలికను కవిత్వం చేయడమే లక్ష్యంగా ఉండాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కవులు తమ కవిత్వాన్ని కవి సమ్మేళనంలో వినిపించారు. ఆదివారం నిర్వహించే వర్కషాప్‌లో ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యుడు కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్, ప్రధాన వక్తగా కేంద్ర సైట్ అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, కార్యదర్శి మద్దిలేటి, దికర్, బాలీశ్వర్, బాల్‌రాం, గౌతమ్, జయప్రకాశ్, విజయ్‌కాంత్, భూపాల్‌రెడ్డి, గౌస్‌పాషా, దేవదానం, గఫార్, రవి పాల్గొన్నారు.

సీతారాంను సన్మానిస్తున్న కవులు

భక్తుల సందడి

- స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

కొల్లాపూర్, ఆగస్టు 10: శ్రావణమాస తొలి శనివారం సందర్భంగా కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం తెల్లవారు జాము నుంచే ఆలయ అర్చకులు స్వామివారికి పూజలు నిర్వహించారు. భక్తులు కూడా పెద్దెత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంపత్‌కుమార్ శర్మ స్వామి వారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మాసంలో తమ ఇంట్లో జరిగే పెళ్లిల మొదటి శుభలేఖను స్వామి వారికి అందించి ప్రత్యేక పూజలు చేయించారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, ఆగస్టు 10 : శ్రావణమాసం తొలి శనివారం కావడంతో ఊర్కొండపేట గ్రామ పరిధిలోని పబ్బతి ఆంజనేయ స్వామి అలయం భక్తులతో కిటకిటలడింది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కొంత మంది భక్తులు శ్రావణ మాసం తొలి శనివారం కావడంతో ఆలయ ప్రాంతంలో సత్యానారాయణ స్వామి వ్రాతాలు నిర్వహించినట్లు ఆలయ ఈవో సత్యాచెంద్రారెడ్డి తెలిపారు. అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో క్లర్కుగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్ రెడ్డిని అలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు దత్తు, శ్రీను, ప్రవీణ్, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా నేత బాలస్వామి

బురదమయంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

చారకొండ, ఆగస్టు 10 : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా నేత బాలస్వామి అన్నారు. శనివారం మండలంలోని జూపల్లిలో కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చిన్నపాటి వర్షానికి వీధులన్ని బురదమయంగా ఉండి రోడ్డుపై నీళ్లు నిల్వ ఉండడంతో దోమలు చేరి విష జ్వరాలు బారిన పడుతున్నారని పేర్కొన్నారు. జూపల్లి నుంచి వంగూరు గేటు వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని చెప్పారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్కశ్రీను, మధు, పెంటయ్య, గెల్వయ్య, బుచ్చిరాములు, ఎల్లయ్య పాల్గొన్నారు.

బొలెరో, ఆర్టీసీ బస్సు ఢీకొని పలువురికి గాయాలు

అచ్చంపేటరూరల్, ఆగస్టు 10 : అచ్చంపేటకు చెందిన ఆర్టీసీ బస్సు, బొలెరో ఎదురెదురుగా ఢీకొని పలువురికి గాయాలైన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దేవరకొండ వెళ్తుతుండగా డిండి వైపు నుంచి వస్తున్న బొలెరో నడింపల్లి వై జంక్షన్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు, బొలెరేలో ఉన్న ఇద్దరికి గాయాలు కాగా అచ్చంపేట ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై అచ్చంపేట ఆర్టీసీ డీఎం మురళి దుర్గా ప్రసాద్‌ను వివరణ కోరగా బొలెరో డ్రైవర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, బోలెరో

ప్రభుత్వ పనులకు ఆర్డీవో సొంత వాహనం

వాహనానికి ఉన్న ఆర్డీవో అచ్చంపేట నేమ్ ప్లేట్

అచ్చంపేటటౌన్, ఆగస్టు 10 : ప్రభుత్వ పనులకు ఆర్డీవో సొంత వాహనం ఉపయోగించి ప్రభుత్వం నుంచి డబ్బులు డ్రా చేస్తూ అధికారులు తమ పొట్టకొడుతున్నారని తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్ అద్దె వాహన అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు అద్దె వాహనాలు ట్యాక్సీ ప్లేట్‌తో ప్రభుత్వ పనులకు ఉపయోగించాలి. కానీ అచ్చంపేట ఆర్డీవో మాధవి సొంత వాహనంతో ప్రభుత్వ పనులకు ఉపయోగించి బిల్లులు పెట్టి ప్రభుత్వ నుంచి డబ్బులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా చేయడంతో నిరుద్యోగులైన ఫోర్ వీలర్ ట్యాక్సీ వోనర్లు కం డ్రైవర్లు నష్టపోతున్నారని వాపోయారు. ప్రభుత్వ అధికారులు సొంత వాహనాలకు ఫోర్‌వీలర్ ప్రైవేట్ డ్రైవర్‌లను తమ వాహనాలకు డ్రైవర్‌లుగా పెట్టుకోవడం లేదని తమ కార్యాలయంలోనే కింది స్థాయిలోనే పని చేస్తున్న ఉద్యోగులను నియమించుకొని తమ పొట్టకొడుతున్నారని ఆరోపించారు. ఉదాహరణకు ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్‌లను ఆర్డీవో సొంత వాహనానికి డ్రైవర్‌లుగా ప్రభుత్వ పనులకు వినియోగించినట్లు ఆయన ఆరోపించారు. ప్రభుత్వం గజిటెడ్ అధికారులకు ప్రభుత్వ వాహనాలనే ఉపయోగించి తమకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు.

బిల్లులు డ్రా చేయలేదు

అచ్చంపేటకు బదిలీపై వచ్చి ఐదు నెలలు కావస్తుంది. ఇప్పటి వరకు నేను ప్రభుత్వ పనులకు నా సొంత వాహనం ఉపయోగించలేదు. రెవెన్యూ డివిజన్‌లో ప్రభుత్వ పనుల పర్యటనలకు ఇప్పటి వరకు నేను అద్దె వాహనాలను మాత్రమే ఉపయోగించాను. ప్రభుత్వం ద్వారా నేను సొంత వాహనంపై ఎలాంటి బిల్లులు క్లెయిమ్ చేయలేదు. ప్రైవేటు వాహనాలు టాక్స్ ప్లేట్ వాహనాలపైనే బిల్లులు క్లెయిమ్ చేశాను. ఇప్పటి వరకు క్లెయిమ్ చేసిన బిల్లులు ప్రభుత్వం నుంచి అందలేదు.

– మాధవి, ఆర్డీవో

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

ఉప్పునుంతల, ఆగస్టు 10 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ హామీలను తుంగలో తొక్కిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేయడం తప్పదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ పోటీ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌గౌడ్, నరేందర్‌రావు, నాయకులు దుర్గా ప్రసాద్, సైదులుయాదవ్, మహేశ్, ఎల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

తీజ్ ఉత్సవాలు ప్రారంభం

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 10 : కల్వకుర్తి పట్టణ పరిధిలోని జేపీ నగర్‌లో శనివారం తీజ్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయాయి. తీజ్ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాంప్రదాయంబద్ధంగా మట్టికి పూజలు చేసి యువతులకు బుట్టల్లో నింపారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ హాజరై పూజలు చేసినట్లు నిర్వాహకుడు హన్మానాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నిరంజన్, దేవీలాల్ చౌహాన్, శ్రీనునాయక్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బిజినేపల్లి, ఆగస్టు 10 : మండలంలోని పాలెంలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, శుభ్రతపై తగు జాగ్రత్తలు వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు యాద య్య, రామాంజనేయులు, జయశంకర్, గోవర్ధన్ ఉన్నారు.

వయనాడు బాధితులకు విరాళం అందజేత

తిమ్మాజిపేట, ఆగస్టు 10 : ప్రకృతి బీభత్సంతో సర్వస్వం కోల్పోయిన వయనాడు బాధితులకు మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ హమాలీలు రూ.10వేల విరాళాన్ని ప్రకటించారు. ఆ డబ్బులను హమాలీలు శనివారం రూ.10వేలు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, మధు, జీవన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కల్వకుర్తి రూరల్/వెల్దండ, ఆగస్టు 10 : కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో శనివారం మృతి చెందిన గోరటి రాందాస్, మేకల పోషమ్మల కుటుంబాలను కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, నాయకులు పరామర్శించారు. అంతకుముందు మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వెల్దండ మండలం రావిచెట్టుబావితండాకు చెందిన రాత్లవత్ కిరణ్‌నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెల్దండ మాజీ వైస్ఎంపీపీ వెంకటయ్యగౌడ్ పరామర్శించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే బొల్లిగుట్టతండాకు చెందిన జీవులనాయక్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. వారి వెంట నాయకులు బాల య్య, నిజాం, రాములు, వెంకటయ్య, రామాంజన్, పాండు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, అశోక్, ధన్‌సింగ్, శ్రీను, అమ్మనాయక్ ఉన్నారు.

ఆర్టీసీ డీఎంకు వినతి

కల్వకుర్తిరూరల్, ఆగస్టు 10 : కల్వకుర్తి పట్టణం నుంచి తెల్కపల్లికి నడపించే బస్సు సర్వీసులను రామగిరి మీదుగా దాసర్లపల్లి, మామిళ్లపల్లి, రాకొండ గ్రామాల మీదుగా నడిపించాలని కోరుతూ కల్వకుర్తి టీఎస్ఆర్టీసీ డీఎం సుభాషిణికి దాసర్లపల్లి గ్రామస్తులు నర్సింహారెడ్డి, విజయేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి శనివారం వినతిని అందించారు. తమ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిని అందజేశామని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై డీఎం స్పందించి రూట్ ప్లాన్ పరిశీలించిన అనంతరం బస్సు సౌకర్యం కల్పిస్తామని డీఎం పేర్కొన్నారు.

ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కల్వకుర్తిరూరల్, ఆగస్టు 10 : కల్వకుర్తి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కల్వకుర్తి మండలాధ్యక్షుడు నెహ్రూప్రసాద్ అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతాకాన్ని ఉపాధ్యాయుడు రాధాకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మణశర్మ, వెంకటేశ్వర్లు, లింగమయ్య, విజయ్‌కుమార్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగర్‌కర్నూల్, ఆగస్టు 10: నాగర్‌కర్నూల్ పట్టణంలోని రాంనగర్ కాలనీ, పాత మార్కెట్‌యార్డు, రామకృష్ణ టాకీస్, పుల్లారెడ్డి దవాఖాన ఏరియాలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కృష్ణ గోపాల్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయం వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

రైతులను పట్టించుకోవడంలేదు

వంగూరు, ఆగస్టు 10 : అర్హత కలిగి రుణమాఫీ కానీ రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకుడు శివరాములు శనివారం ప్రకటనలో విమర్శించారు. రూ.లక్ష లోపు, లక్షన్నర లోపు ప్రభుత్వం ఇంత వరకే రుణమాఫీ చేసిందని, మాఫీ కానీ రైతులు మండలంలో పెద్దెత్తునా ఉన్నప్పటికీ వారి గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో చలనం రాకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

విజయవంతమైన రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న యువకులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 10 : ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినాన్ని పురస్కరించుకొని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 50 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం బస్టాండ్ చౌరస్తాలో కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకొని గురుకుల, కస్తూర్బా పాఠశాలలకు చెందిన విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ విష్ణు, నర్సింహ, చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidney Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

PLOT FOR SALE
★జడ్చర్ల ట